క్లుప్తంగా

రైతులకు అండగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం



భీమవరం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

భీమవరం: రైతులకు అండగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. ఖరీఫ్ పంట చేతికొచ్చే సమయంలో మిచాంగ్ తుపాను ప్రభావం వల్ల ప్రస్తుతం కురుస్తున్న వర్షాల నేపథ్యంలో రైతులు పంట నష్టపోకుండా కాపాడుకునే విధంగా వ్యవసాయ శాఖ అధికారులు, రైతు భరోసా కేంద్రాలలో పనిచేస్తున్న సిబ్బంది రైతులకు అండగా ఉండాలని సూచించారు. రైతులకు ఎప్పటికప్పుడు తగు సూచనలు ఇచ్చి భరోసా కల్పించాలన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన క్యాంపు కార్యాలయం నుంచి వ్యవసాయ శాఖ ఏడీ సీహెచ్ శ్రీనివాసరావుతో ఫోన్లో మాట్లాడారు. భీమవరం నియోజకవర్గంలో పంట పొలాల పరిస్థితిపై, ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు నేపథ్యంలో పంటకు ఎక్కడైనా నష్టం వచ్చిందా అని ఆరా తీశారు.

చట్టాలపై అవగాహన అవసరం

కాళ్ల: చట్టాలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని మహిళా న్యాయవాదులు పి.రాధ, జి.గాయత్రి అన్నారు. పెదఅమిరం గ్రామ సచివాలయంలో సోమవారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. భీమవరం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి హాజరైన డ్వాక్రా మహిళలకు వారు మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు. ఆస్తిలో మహిళల హక్కు, వయోవృద్ధుల సంక్షేమ చట్టం, వినియోగదారుల చట్టంపై అవగాహన కల్పించారు. ఈనెల 9న నిర్వహించే లోక్అదాలత్ ద్వారా అర్హత కలిగిన కేసులను రాజీ చేసుకోవచ్చన్నారు. శ్రీలక్ష్మి, శశికళ, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

క్యాంపస్ సెలక్షన్స్‌లో 34 మంది ఎంపిక

భీమవరం: పట్టణంలోని ఎస్ఆర్కేఆర్ ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన 34 మంది ఫైనల్ ఇయర్ విద్యార్థులు సిఫీ టెక్నాలజీస్‌కు ట్రైనీ ఇంజినీర్స్‌గా ఏడాదికి రూ.6 లక్షల వేతనంతో ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కేవీ మురళీకృష్ణంరాజు చెప్పారు. ఎంపికైన విద్యార్థులను సోమవారం కళాశాలలో సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ సాగి రామకృష్ణనిశాంత్ వర్మ అభినందించారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.జగపతిరాజు, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ సెల్ డీన్ డాక్టర్ కేఆర్ సత్యనారాయణ మాట్లాడుతూ కంప్యూటర్ సైన్స్ నుంచి 14, ఈసీఈ నుంచి 10, ఐటీ నుంచి 8 మంది, మెకానికల్, ఎలక్ట్రికల్ విభాగాల నుంచి ఒక్కొక్కరు ఎంపికయ్యారన్నారు. వివిధ విభాగాల హెడ్స్ వి.చంద్రశేఖర్, బీహెచ్‌వీఎస్ రామకృష్ణంరాజు, బీఆర్కే వర్మ పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వ చర్యలు భేష్



సమావేశంలో మాట్లాడుతున్న పాతపాటి మురళీరామరాజు

భీమవరం: తుపాను కారణంగా రైతులు నష్టపోకుండా ప్రభుత్వం తీసుకున్న చర్యలు అభినందనీయమని రైతు కార్యాచరణ సమితి అధ్యక్షుడు పాతపాటి మురళీరామరాజు అన్నారు. సోమవారం భీమవరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తుపాను కారణంగా కురుస్తున్న భారీ వర్షాలకు తడిచిన ధాన్యాన్ని కొనుగోలు చేయడంలో నిబంధనలు సడలించి రైతులను ఆదుకోవాలని కోరారు. ఇప్పటికే రైతుల పట్ల సానుభూతితో తేమ శాతంతో నిబంధన లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలంటూ కలెక్టర్ పి.ప్రశాంతి తీసుకున్న నిర్ణయంతో రైతులకు నష్టం తగ్గుతుందన్నారు. సమితి అధికార ప్రతినిధి కలగర కమలాకరశర్మ మాట్లాడుతూ జీపీఎస్ లేకుండానే ధాన్యంలోడు వాహనాలను ఆర్బీకేలకు వెళ్లే విధంగా ప్రభుత్వ తీసుకున్న నిర్ణయాన్ని అధికార యంత్రాంగం పటిష్ఠంగా అమలు చేయాలన్నారు. రైతులకు రవాణా చార్జీలకు చెల్లింపులో నష్టం లేకుండా చూడాలని కోరారు. ఈ సమావేశంలో సమితి గౌరవాధ్యక్షుడు కలిదిండి గోపాలకృష్ణంరాజు, మంతెన కృష్ణంరాజు పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్ జిల్లా జట్టుకు ఇద్దరి ఎంపిక



కే మహాలక్ష్మి



ఏ కార్తీక్

ఉండి: ఎన్నార్పీ అగ్రహారం జెడ్పీ హైస్కూల్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులు జిల్లా సబ్‌జూనియర్ హ్యాండ్‌బాల్ జట్టుకు ఎంపికైనట్లు హెచ్ఎం ఎంవీ సత్యనారాయణ సోమవారం చెప్పారు. ఈ నెల 3న ఏలూరులో జరిగిన సెలక్షన్స్‌లో తమ విద్యార్థులు జిల్లా జట్టుకు ఎంపికయ్యారని, ఈ నెల 9, 10 తేదీల్లో తెనాలిలో జరిగే రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ పోటీల్లో జిల్లా జట్టు తరఫున ఆడనున్నారని తెలిపారు. విద్యార్థులను, పీఈటీ కే శ్రీనివాసరావును హెచ్ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

పంట నష్టం వాటిల్లకుండా చర్యలు

ఉండి: తుపాను కారణంగా మండలంలో పంట నష్టం జరగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఏఓ బి.సంధ్య చెప్పారు. తుపాను కారణంగా మండలంలోని పలు గ్రామాల్లో వరి చేలను ఏఓ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముందుగా వరినాట్లు పూర్తి చేసుకున్న ఉప్పులూరు, కోలమూరు, యండగండి, ఆరేడు గ్రామాల్లో అది, సోమవారం 960 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ఆఫ్‌లైన్ ద్వారా రైస్ మిల్లులకు తరలించినట్లు తెలిపారు. మండలంలో రైతులకు అన్ని విధాలుగా సహకారం అందిస్తున్నామన్నారు. పట్టుబడి జరిగిన ధాన్యాన్ని వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలించే ఏర్పాట్లు చేశామన్నారు. ఎక్కడా ఎటువంటి ఇబ్బందులు లేవన్నారు. మండలంలో కురుస్తున్న వర్షాలకు ఇప్పటివరకు వరిచేలకు ఎటువంటి నష్టం వాటిల్లలేదన్నారు. రైతులు ప్రస్తుతం పరిస్థితతుల్లో వరిచేలను కోత కోసేందుకు ప్రయత్నించవద్దన్నారు. వరిచేలు కోతకోయకుండా ఉంటేనే ఎటువంటి నష్టం ఉండదని కోతకోసిన అనంతరం ధాన్యం తడిస్తే నష్టం వాటిల్లుతుందన్నారు. రైతులు ధాన్యం తరలింపులో ఏవైనా సమస్యలు తలెత్తితే తమను ఫోన్ ద్వారా సంప్రదించాలని ఏఓ కోరారు.



ఉప్పులూరులో వరిచేలను పరిశీలిస్తున్న ఏఓ సంధ్య

శివారు గ్రామాల్లో మెడికల్ క్యాంపులు

కాళ్ల: తుపాను ప్రభావం వల్ల ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు, అనారోగ్యాలు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తహసీల్దార్ కృష్ణారావు చెప్పారు. సోమవారం మండల శివారు గ్రామాలను ఆయన పరిశీలించారు. మోడీ ఎస్సీ బోస్ కాలనీలో మెడికల్ క్యాంపు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తుపాను ప్రభావం వల్ల నష్టం వాటిల్లకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని, అవసరమైతే ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించేందుకు చర్యలు చేపడతామన్నారు. రెవెన్యూ అధికారులు, వైద్య శాఖ సిబ్బంది ఉన్నారు.

సిద్ధాపురంలో పునరావాస కేంద్రం ఏర్పాటు

ఆకివీడు: తుపాను తీవ్రతను దృష్ట్యా కొల్లేరు తీరంలోని సిద్ధాపురంలో తుపాను పునరావాస కేంద్రం ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ విజయలక్ష్మి చెప్పారు. మండలంలోని లోతట్టు ప్రాంతాలను సోమవారం తహసీల్దార్, ఎంపీడీఓ కె.వాణీ పరిశీలించారు. తహసీల్దార్ మాట్లాడుతూ సిద్ధాపురంలో లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలు ముంపునకు గురయ్యే అవకాశం ఉండటంతో జెడ్పీ హైస్కూలులో పునరావాస కేంద్రం, తుపాను షెల్టర్ వద్ద ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశామన్నారు. సిద్ధాపురం శివారు కురుపాకలో లోతట్టు ప్రాంతాల్ని, మత్స్యకారులు వేటకు వెళ్లే ప్రాంతాల్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వేటకు వెళ్లడం లేదని మత్స్యకారులు తహసీల్దార్‌కు వివరించారు. మత్స్యకారుల ఇళ్లకు వెళ్లి మహిళలతో ఎంపీడీఓ వాణి మాట్లాడారు. వేటకు విరామం ఇవ్వడం వల్ల తమకు జీవనోపాధికి నిత్యావసరాలు అందజేయాలని ఎంపీడీఓకు విజ్ఞప్తి చేశారు. కొల్లేరుకు ఆనుకుని ఉన్న కురుపాక లోతట్టు ప్రాంతమని, సరస్సుకు వరద వస్తే ఈ గ్రామానికి ముంపు తప్పదన్నారు. ముంపునకు గురైతే పునరావాస కేంద్రానికి వస్తామని, తమ ప్రాంతానికి వైద్యుల్ని పంపించాలని వారు విజ్ఞప్తి చేశారు. అనంతరం అయిభీమవరం, అజ్జమూరు, ఆకివీడు ప్రాంతాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు, మిల్లుల వద్ద ఆఫ్‌లైన్ ధాన్యం కొనుగోళ్లను అధికారులు పరిశీలించారు. ఆర్ఐ సూర్యనారాయణ, ఈఓపీఆర్డీ సుబ్బారావు, కార్యదర్శి సతీష్ పాల్గొన్నారు.

ఎడతెరిపి లేకుండా వర్షం

భీమవరం అర్బన్: తుపాను ప్రభావంతో మండలంలోని గ్రామాల్లో సోమవారం ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. పల్లపు గ్రామాలలో పలు రోడ్లు జలమయమయ్యాయి. బలమైన ఈదురు గాలులు వీయడం వల్ల కొన్ని చోట్ల చెట్లు కొమ్మలు నెలకొరిగాయి. రెవెన్యూ, పోలీస్, పంచాయతీ సిబ్బంది సమన్వయంతో ఇప్పటికే అప్రమత్తం చేశారు. రాత్రి వరకు సచివాలయ సిబ్బంది సచివాలయాల్లో ఉంటూ పరిస్థితిని సమీక్షిస్తున్నారు.

లోతట్టు ప్రాంతాల పరిశీలన

భీమవరం (ప్రకాశం చౌక్): తుపాను కారణంగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో పట్టణంలోని దుర్గాపురం, లంకపేట, మెంటేవారితోట తదితర లోతట్టు ప్రాంతాలను మున్సిపల్ కమిషనర్ ఎం.శ్యామల సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రిలీఫ్ క్యాంప్స్ ఏర్పాటు చేయాలని ఆయా ప్రాంతాల వార్డు సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. అదేవిధంగా వాటర్ తొలగిన తర్వాత వెంటనే శానిటేషన్ పనులు చేపట్టాలని సూచించారు.

విద్యుత్ సమస్యలపై తక్షణం స్పందించండి

ఆకివీడు: తుపాను ప్రభావాన్ని దృష్టిలో పెట్టుకుని విద్యుత్ సరఫరాలో సమస్యల్ని తక్షణం పరిష్కరించేందుకు టోల్ ఫ్రీ నంబర్ 1912కు ఫోన్ చేయాలని ట్రాన్స్‌కో ఈఈ పీర్ అహ్మద్ ఖాన్ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. తుపాను ప్రభావం వల్ల విద్యుత్ తీగలు పడిపోయినా, స్తంభాలు వాలిపోయినా, వైర్లపై చెట్లు కూలినా, విద్యుత్ తీగలు తెగిపడినా తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు. ఇళ్లల్లో స్విచ్‌లను ఆఫ్ మోడ్‌లో ఉంచుకోవాలన్నారు. తడిచేతులతో ముట్టుకోవద్దని, కరెంట్ స్తంభాలు, మోటర్లను తడి చేతులతో ముట్టుకోవద్దని హెచ్చరించారు. ఇళ్ల సర్వీసు వైర్లు తెగినా, జాయింట్లు కట్ అయినా సమాచారం తెలియజేయాలన్నారు. రైతులు విద్యుత్ మోటార్ల వినియోగంలో జాగ్రత్తలు పాటించాలని విజ్ఞప్తి చేశారు.



భీమవరంలో లోతట్టు ప్రాంతాలను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ ఎం.శ్యామల



మోడీ గ్రామం బోస్ కాలనీలో వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ కృష్ణారావు



కురుపాక వద్ద మత్స్యకారులతో మాట్లాడుతున్న తహసీల్దార్ విజయలక్ష్మి

ఘంటసాల గానామృతం చిరస్మరణీయం

భీమవరం: ఘంటసాల గానామృతం యుగాంతం వరకు చిరస్మరణీయమని ప్రజా నాట్య మండలి జిల్లా కార్యదర్శి మల్లుల సీతారాం ప్రసాద్ అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో మారుతీ టాకీస్ సెంటర్‌లో ఘంటసాల జయంతిని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆనాటి అగ్రనటుల నటనతోపాటు ఘంటసాల గానం జీవం పోసిందని అన్నారు. కళారంజని నాటక పరిషత్ అధ్యక్షుడు జావ్వాది శ్రీనివాస్, శోభన్‌బాబు కల్చరల్ అసోసియేషన్ సభ్యుడు భట్టిప్రోలు శ్రీనివాసరావు, రీడర్స్ ఫోరమ్ అధ్యక్షుడు అరసవల్లి సుబ్రహ్మణ్యం, బార్ అసోసియేషన్ సభ్యుడు ఉండపల్లి రమేష్ నాయుడు, చెరుకువాడ రంగసాయి పాల్గొన్నారు.

ఇంటింటికీ అయోధ్య రాములోరి అక్షింతలు

ఆకివీడు: అయోధ్య రామాలయ విశిష్టతను తెలియజేసేలా అయోధ్య రాములోరి అక్షింతల్ని ఇంటింటికీ అందజేయాలనే సంకల్పంతో సోమవారం స్థానిక ఆర్యవైశ్య కళ్యాణమందిరంలో ప్రత్యేక పూజలు చేసినట్లు శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర జిల్లా ప్రముఖ్ కందులపాటి సింహాద్రి చెప్పారు. కళ్యాణమందిరంలో పూజా కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం భక్తులకు అయోధ్య రాములోరి అక్షింతల్ని ఇవ్వగా ఆయా గ్రామాల్లోని రామాలయాల వద్ద ప్రత్యేక పూజలు చేసి అయోధ్య పంపనున్నామని ఆయన చెప్పారు. గ్రామాల్లో భక్తులు తయారు చేసి అందజేసిన అక్షింతల్ని కలిపి అయోధ్య పంపుతామన్నారు. కరసేవకులు చిట్టిబాబు, మాణిక్యంలను సత్కరించారు.

గ్రామాల్లో పర్యటించిన అధికారులు

వీరవాసరం: తుపాను కారణంగా ధాన్యాన్ని ఒబ్బిడి చేసుకోవాలని మండల స్థాయి అధికారులు రైతులకు సూచించారు. మండలంలోని వీరవాసరం, అండలూరు, వడ్డిగూడెం, తోకలపూడి, కొణితివాడ గ్రామాల్లో అధికారులు సోమవారం పర్యటించారు. తుపాను ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు ధాన్యం తడిసి ఇబ్బందులు పడుతున్న రైతుల వద్దకు వెళ్లి ప్రస్తుత పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి రైతు వద్ద ఉన్న ధాన్యాన్ని ఒబ్బిడి చేయడం జరుగుతుందన్నారు. తహసీల్దార్ సుందర్రాజు, ఏఓ బిన్నిబాబు, ఎంపీడీఓ జ్యోతి, ఎంపీటీసీ బొల్లంపల్లి శ్రీనివాస చౌదరి, సర్పంచ్ భోగేశ్వర రావు పాల్గొన్నారు.

మార్మోగిన శివనామస్మరణ



గునుపూడిలోని శ్రీఉమాసోమేశ్వరస్వామికి అభిషేకాలు చేస్తున్న అర్చకులు



క్యూలైన్లల్లో స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

- జోరున వర్షంలోనూ స్వామివారిని దర్శించుకున్న భక్తులు
- శ్రీఉమాసోమేశ్వరునికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు

భీమవరం (ప్రకాశం చౌక్): 'హర హర మహదేవ శంభో శంకరా' అంటూ శివనామస్మరణతో భీమవరం పంచారామక్షేత్రం శ్రీఉమాసోమేశ్వర జనార్దనస్వామి ఆలయం మార్మోగింది. కార్తీక మాసం మూడో సోమవారం పంచారామక్షేత్రానికి భక్తులు పోటెత్తారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా పంచారామక్షేత్రాల యాత్ర భక్తులు, జిల్లా నలమూల నుంచి భారీగా భక్తులు తరలివచ్చి శ్రీఉమాసోమేశ్వర స్వామిని దర్శించుకున్నారు. సోమవారం తెల్లవారుజాము నుంచే శ్రీఉమాసోమేశ్వరునికి నిర్విరామంగా ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు కందుకూరి సాంబాబు, చేకూరి రామకృష్ణ, అర్చకుల బృందం స్వామివారికి మహన్యాసపూర్వక రుద్రాభిషేకాలు, పంచమృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక అలంకరణ, పూజలు జరిపారు. మహిళలు కార్తీక నోములు నోచుకున్నారు. దూరప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దేవస్థానం నిర్వహిస్తున్న అన్నదానంలో భోజనం చేశారు. దేవస్థాన కార్యనిర్వహణ అధికారి డి.రామకృష్ణంరాజు, ధర్మకర్తలు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు. కార్తీక మాసోత్సవాల్లో భాగంగా 21వ రోజు సోమవారం దేవస్థానానికి రూ.5,15,650 ఆదాయం లభించిందని ఆలయ ఈఓ డి.కృష్ణంరాజు తెలిపారు. భక్తులకు ఏర్పాట్లను ధర్మకర్తల మండలి సభ్యులు కుర్మదాసు సత్యశ్రీనివాస్, నాచు శ్రీవల్లి, లక్కు త్రిమూర్తులు, కోయ తాతాజీ, నల్లం రఘుబాబు, చెల్లబోయిన సూర్యప్రకాష్, సోమాదుల లీలా ఈశ్వరి, తాణాల రామకృష్ణ పర్యవేక్షించారు.

శ్రీభీమేశ్వర స్వామి ఆలయంలో..

పట్టణంలోని శ్రీభీమేశ్వరస్వామి ఆలయంలో సోమవారం తెల్లవారుజాము నుంచే స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ కార్యనిర్వహణ అధికారి ఎం.శ్రీనివాసరావు, ధర్మకర్తలు ఆలయ అర్చకులు పాల్గొన్నారు.


రొయ్యల రైతులు అప్రమత్తంగా ఉండండి

భీమవరం: తుపాను కారణంగా కురుస్తున్న వర్షాలతో ఆక్వా రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎడతెరిపి లేని వర్షాలకు చలిగాలులు తోడవ్వడంతో ప్రధానంగా రొయ్యల్లో డీఓ శాతం తగ్గి తెగుళ్ల బారిన పడుతున్నాయని కలవరపడుతున్నారు. జిల్లాలో దాదాపు 50 వేల ఎకరాల్లో రొయ్యల సాగులో ఉండగా తగిన కౌంట్‌కు రాకముందే తెగుళ్ల కారణంగా పట్టుబడులు పడుతున్నట్లు రైతులు వాపోతున్నారు. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మత్స్యశాఖాధికారులు సూచిస్తున్నారు. తుపాను కారణంగా విద్యుత్‌కు అంతరాయం ఏర్పడితే చెరువుల్లోని ఏరియేటర్లు వినియోగించుకునేందుకు జనరేటర్లు, ఆయిల్ ఇంజిన్లను సిద్ధం చేసుకోవాలి. వాటి ద్వారా ఏరియేటర్లను ఉపయోగించుకుని ఆక్సిజన్ కొరత ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలి. రొయ్యల్లో ఆక్సిజన్ కొరత నివారణకు పొటాషియం పర్మాంగనేట్ పొడిని కూడా సిద్ధంగా ఉంచుకుని అవసరమైన మేరకు చెరువుల్లో చల్లాలి., చెరువుల్లో నీటి మట్టం వర్షం కారణంగా పెరగకుండా 50 సెంటీమీటర్ల లోతు వరకు ఉండే విధంగా జాగ్రత్తలు తీసుకోవాలి. వర్షం కారణంగా చెరువుల్లో ఉష్ణోగ్రత తగ్గుతున్నందున రొయ్యలు మేత కూడా సక్రమంగా తినవని, అవసరం మేరకు మాత్రమే మేతలు వేసి ఖర్చు తగ్గించుకోవాలి. చెరువు గట్లు పల్లంగా ఉన్న చోట గండ్లు పడకుండా పటిష్ఠం చేసుకోవాలని, అలాగే గట్లు ఎత్తు తక్కువ ఉన్న చెరువుల్లో రొయ్యలు బయటకు వెళ్లకుండా వలను ఏర్పాటు చేసుకోవాలంటున్నారు. వర్షాలు పడే రోజుల్లో తగిన చర్యలు తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.



రొయ్యల చెరువులో ఏరియేటర్లు తిప్పుతున్న దృశ్యం

ముందస్తు చర్యలతో నష్టాలు తగ్గుతాయి



భారీ వర్షాల కారణంగా రొయ్యలు, చేపల చెరువుల వద్ద రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటే నష్టాలు తగ్గుతాయి. ప్రధానంగా ఎడతెరిపి లేని వర్షం కారణంగా చలి వాతావరణం ఏర్పడడంతో చెరువుల్లో ఉష్ణోగ్రత తగ్గి రొయ్యలకు ఇబ్బంది ఏర్పడుతుంది. అందువల్ల నిత్యం ఏరియేటర్లు తిరిగేలా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ఇప్పటికే పట్టుబడికి వచ్చిన రొయ్యలను మార్కెట్‌కు విక్రయించుకోవడమే మంచిది.

– ఎల్ఎల్ఎన్ రాజు, మత్స్యశాఖ ఏడీ, భీమవరం

జగనన్న ప్రభుత్వంలో అందరికీ సంక్షేమ ఫలాలు



కొవ్వాడ అన్నవరంలో సచివాలయం వద్ద సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న ఎంపీపీ పేరిచర్ల విజయ నరసింహరాజు

భీమవరం అర్బన్: ప్రతి కుటుంబం ఆర్థికంగా ఎదగాలనే సదుద్దేశంతో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందిస్తున్నారని ఎంపీపీల సంఘం జిల్లా అధ్యక్షుడు పేరిచర్ల విజయ నరసింహరాజు అన్నారు. భీమవరం మండలంలోని కొవ్వాడ అన్నవరంలో సోమవారం ఏఎంసీ మాజీ చైర్మన్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు తిరుమాని ఏడుకొండలు అధ్యక్షతన ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా సచివాలయం వద్ద సంక్షేమ పథకాల లబ్ధి బోర్డును ఎంపీపీ పేరిచర్ల విజయ నరసింహరాజు ఆవిష్కరించి మాట్లాడారు. కుటుంబంలో రైతు ఉంటే రైతు భరోసా ద్వారా రూ. 13 వేల 500, భార్య డ్వాక్రా మహిళైతే డ్వాక్రా రుణ మాఫీ, సున్నా వడ్డీ, తల్లిదండ్రులు వృద్ధులైతే వారిలో ఒకరికి నెలకు రూ. 2వేల 750, పిల్లలు చదువుకు కుంటే అమ్మ ఒడి ద్వారా రూ.15 వేలు, తల్లి 40 నుంచి 60 మధ్య వయస్సురాలై ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ మహిళ అయితే రూ.18,750, పిల్లలు ఇంటర్మీడియట్, ఇంజినీరింగ్ చదివితే విద్యా దీవెన, ఫీజురీయింబర్స్‌మెంట్ కింద సంక్షేమ లబ్ధిని తల్లిదండ్రులపై భారం పడకుండా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అందిస్తున్నారన్నారు. అంతేకాకుండా పేదలు వ్యాపారం చేసుకుంటే జగనన్న చేదోడు ద్వారా రూ.10 వేలు వడ్డీ లేని రుణం, నాయీబ్రాహ్మణులు, ఆటోవాలాలు, రజకులకు రూ.10 వేలు, చేనేత కార్మికులకు రూ. 24 వేలు, పాస్టర్లకు, లాయర్లకు రూ.5 వేలు ఇలా అన్ని వర్గాలను దృష్టిలో పెట్టుకుని సంక్షేమ పథకాలు రూపొందించి అమలు చేస్తున్నారు. 2019లో సీఎం వైఎస్ జగన్ అధికారం చేపట్టేనాటికి చంద్రబాబు ఖజానాలో రూ.100 కోట్లు ఉంచారని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సచివాలయ వ్యవస్థను తీసుకురావడమే కాకుండా గ్రామాలలో సచివాలయాలు, ఆర్బీకే, విలేజ్ హెల్త్ క్లినిక్ సెంటర్లు నిర్మించారన్నారు. ఏఎంసీ మాజీ చైర్మన్ తిరుమాని ఏడుకొండలు, మండల జేసీఎస్ కన్వీనర్ కోమటి రాంబాబు మాట్లాడుతూ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ నియోజకవర్గాన్ని అభివృద్ధిలో ముందుకు తీసుకువెళ్తున్నారన్నారు. నియోజకవర్గంలో సుమారు 12 వేల మంది పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వడమే కాకుండా ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయిస్తున్నారన్నారు. అనంతరం వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించారు. పార్టీ అధ్యక్షుడు వేగేశ్న నరసింహరాజు, అల్లూరి సాయి రాజు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, కొట్టి కుటుంబరావు, నామన మహేష్ తదితరులు పాల్గొన్నారు.

మావుళ్లమ్మ పూజా రుసుముల పెంపు

భీమవరం (ప్రకాశం చౌక్): పట్టణంలోని శ్రీమావుళ్లమ్మ అమ్మవారి దేవస్థానంలో పూజా రుసుములు పెంచుతూ దేవదాయశాఖ తాజాగా ఉత్తుర్వులు జారీ చేసినట్లు దేవస్థానం కార్యనిర్వహణ అధికారి యర్రంశెట్టి భద్రాజీ సోమవారం చెప్పారు. పెరిగిన పూజా రుసుముల వివరాలిలా ఉన్నాయి. సహస్రనామార్చన రూ.50, నిత్యపూజ (నెలకు) రూ.300, నిత్యపూజ (ఏడాదికి) రూ.2వేలు, గరగ ప్రదక్షణ రూ.50, చీర సమర్పణ రూ.10, వాపసు చీర (కాటన్, వాయిల్, సిల్క్) రూ.20, వాపసు చీర (పట్టుచీర) రూ.100, తులాభారం (అన్నప్రాసన, నామకరణం) రూ.300, చండీహోమం (ప్రతి అమావాస్య, పౌర్ణమి) రూ.1000, శాశ్వత పూజ రూ. 2,500, కేశ ఖండన రూ.25, సైకిల్ పూజ రూ.25, వాహన పూజ (ద్విచక్రవాహనం) రూ.100, వాహనపూజ (కారు, లారీ, ఆటో) రూ.200, శ్రీ విఘ్నేశ్వర స్వామి అష్టోత్తర నామార్చన రూ.50, నిత్య పూజ (నెలకు) రూ.300, నిత్యపూజ రూ.2వేలు, శ్రీఅమ్మవారి లడ్డు ప్రసాదం 100 గ్రాములు రూ.20, పులిహోర 150 గ్రాములు రూ.10 చొప్పున పెరిగాయి.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

పాలకోడేరు: తన కుమార్తె అదృశ్యంపై తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాళం శ్రీనివాసరావు చెప్పారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గొల్లలకోడేరుకు చెందిన ఓ వ్యక్తి తన 22 ఏళ్ల కుమార్తె గత నెల 29వ తేదీ అర్ధరాత్రి ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఆధ్యాత్మిక పుస్తకాల అందజేత

భీమవరం: చిన అమిరంలోని శ్రీస్వామి యోగేశ్వర నందగిరి విశ్వశాంతి వృద్ధాశ్రమానికి భీమవరం రోటరీ క్లబ్ ఫౌండేషన్ చైర్మన్ ఎస్‌వీఆర్‌సీ జయవర్మ ఆర్థిక సహకారంతో సోమవారం ఆక్సిమీటర్లు, బిస్కెట్లు, ఆధ్యాత్మిక పుస్తకాలు అందజేశారు. సాయి దుర్గాప్రసాద్, గుండు కిషోర్ పాల్గొన్నారు.

ఉండి పోలీస్‌స్టేషన్ తనిఖీ

ఉండి: సాధారణ తనిఖీల్లో భాగంగా ఉండి పోలీస్‌స్టేషన్‌ను నర్సాపురం డీఎస్పీ కే శ్రీనాథ్ సోమవారం తనిఖీ చేశారు. కేసుల రికార్డులు, ఫైల్స్ పరిశీలించి వాటి పురోగతిపై ఆరా తీశారు.

గొంతువాపు నివారణకు టీకాలు

ఆకివీడు: మండలంలో పశువులకు గొంతు వాపు నివారణ టీకాలు వేస్తున్నట్లు మండల పశుసంవర్ధక శాఖ అధికారిణి భార్గవీ సత్య చెప్పారు. సోమవారం అయిభీమవరంలో పశువులకు టీకాలు వేశారు. అన్ని పశువులకు ముందు జాగ్రత్త చర్యలుగా టీకాలు వేయించాలని సూచించారు.

శృంగవృక్షంలో ఎక్స్‌ప్రెస్‌లకు రిక్వెస్ట్ స్టాప్

పాలకోడేరు: భీమవరం నుంచి నడిపే అమలాపురం, నరసాపురం, వైజాగ్ ఎక్స్‌ప్రెస్ బస్సు సర్వీసులకు శృంగవృక్షంలో రిక్వెస్ట్ స్టాప్ ఇస్తామని భీమవరం ఆర్టీసీ డిపో మేనేజర్ పీవీఎస్ఎన్ మూర్తి చెప్పారు. సోమవారం శృంగవృక్షం శ్రీవాసవీ ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్తీకవన సమారాధనలో డిపో మేనేజర్‌ను ఘనంగా సన్మానించారు. సంఘం అధ్యక్షులు అత్యం సూర్యప్రకాశరావు, ప్రధాన కార్యదర్శి సోము రామకృష్ణ పాల్గొన్నారు.